క్లుప్తంగా

పేద విద్యార్థినికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీశైలం

గట్టుప్పల్ : మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన భీమనపల్లి యాదయ్య కూతురు కావ్య నీట్‌లో 393వ ర్యాంకు సాధించినప్పటికీ పేదరికం కారణంగా ఎంబీబీఎస్ చదవలేకపోతోంది. విషయం తెలుసుకున్న తేరట్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమళ్ల శ్రీశైలం కావ్యకు తన వంతుగా ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, వెంకట రమణారెడ్డి, భీమగాని మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ నూర్ మహమ్మద్, రావుల పర్వతాలు, భీమనపల్లి లింగస్వామి, బీరప్ప, చాపల మారయ్య, శంకరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

కనగల్: మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారికి అర్చకులు సహస్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమతో అభిషేకం, పూజలు జరిపించారు. ఒడిబియ్యం, బోనం, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల అమలులో చిత్తశుద్ధి లేదు'

చిట్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు పెండింగ్‌లో ఉండగా అమలుకు వీలుకాని జీవోను విడుదల చేసి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ పార్టీ చూసిందని ఆరోపించారు.

జీవో 25 సవరించాలి

నల్లగొండ : జీవో 25 సవరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 10 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇచ్చి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలనడం ప్రభుత్వానికి సమంజసంగా లేదన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: తీవ్ర అనారోగ్యానికి గురై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన పొన్న పుష్పలతకు గ్రామానికి చెందిన ఉద్యోగుల సంఘంతోపాటూ గ్రామస్తులు ఆదివారం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. రెక్కాడితేనే డొక్కాడే నిరుపేద కుటుంబానికి చెందిన పొన్న జోగయ్యకు భార్య పుష్పలతతో పాటూ అవివాహితులైన కుమారుడు, మానసిక వికలాంగురాలైన కుమార్తె ఉన్నారు. జోగయ్య కుటుంబ పరిస్థితిని చూసి చలించిన గ్రామస్తులు ఆర్థిక సహాయాన్ని అందించారు.

చిరు వ్యాపారులపై వేధింపులు ఆపండి

చండూరు : చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు చేస్తున్న వేధింపులు ఆపాలని సీఐటీయూ చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనుంజయ్ హెచ్చరించారు. ఆదివారం చండూరు పట్టణంలో నిర్వహించిన చిరు వ్యాపారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30 సంవత్సరాలుగా తోపుడు బండ్లు, డబ్బాకొట్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదలను.. రోడ్డు వెడల్పు పేరుతో తొలగించాలని వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. చిరు వ్యాపారులు అంతా పేదవారేనని వారికి అన్యాయం చేయవద్దని అధికారులు కోరారు. సోమవారం చండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరిగి యాదయ్య, గంట యాదగిరి, నాయకులు దేవయ్య, వాజిద్, నరసింహ, నాగరాజు, రమేష్, అంజమ్మ, పూలమ్మ, వాణి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనుంజయ్

ధాన్యంతో నిండిన కొనుగోలు కేంద్రాలు

- పూర్తి కాని మిల్ ట్యాగింగ్
- ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు
- ఇప్పటికే 1.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం రాక



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం

శాలిగౌరారం: ప్రస్తుత వానాకాలం సీజన్ వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో నిండిపోయాయి. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలు శాలిగౌరారం మండలంలో పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో వరికోతలు చేపట్టిన రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మిల్లర్లకు అమ్ముకుందామంటే సరైన ధర లేకపోవడంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకే తమ ధాన్యాన్ని తరలిస్తున్నారు.

18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరు

శాలిగౌరారం మండలంలో వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 20 వేల ఎకరాల్లో వరిపంట సాగయ్యింది. ఈ సీజన్‌లో ప్రభుత్వం 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజూరు చేసింది. ఐకేపీ ఆధ్వర్యంలో 8, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో 4, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఒక కేంద్రం మంజూరయ్యింది. అందులో ఐకేపీ ఆధ్వర్యంలో భైరవునిబండ, చిత్తలూరు(రెండు కేంద్రాలు), గురుజాల, రామాంజాపురం, ఎన్‌జీ కొత్తపల్లి, తుడిమిడి, మనిమద్దె గ్రామాల్లో కేంద్రాలు మంజూరయ్యాయి. పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, అడ్లూరు, మాధారకలాన్, ఊట్కూరు గ్రామాల్లో మంజూరయ్యాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో పెర్కకొండారం, వల్లాల, అంబారిపేట, తక్కెళ్ళపహాడ్ గ్రామాల్లో.. ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇటుకులపహాడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయి.

కేంద్రాలకు చేరిన కాంటాలు

శాలిగౌరారం మండలంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 18 కేంద్రాలను మంజూరు చేసింది. అందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. కానీ కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఐకేపీ, ఎఫ్‌పీఓ, ఎన్‌డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలోని కేంద్రాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికే మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కాంటాలు, తేమశాతం పరికరాలు, టార్పాలిన్లు, ధాన్యం శుద్ధి మిషన్లు, గన్నీసంచులు చేరాయి. ధాన్యం రవాణాకు సంబంధించిన లారీల ఏర్పాటు కూడా పూర్తయ్యింది. అన్నింటిని మించి మిల్ ట్యాగింగ్(మిల్లులకు ధాన్యం కేటాయింపు) ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

6 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తి

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మండలంలో 20 వేల ఎకరాల్లో వరిపంట సాగు జరుగగా.. ఇప్పటి వరకు సుమారు 6వేల ఎకరాల్లో వరి కోతలు జరిగాయి. 1.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరింది. ఈసారి పచ్చిధాన్యంకు బయట సరైన ధర లేకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకే తమ ధాన్యం తరలిస్తుండడంతో రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు నమోదు కానుంది.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



చేతికి వచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబోసి నిల్వ చేస్తున్నాం. వర్షాలు పడుతుండడంతో వరికోతలు కోసేందుకు, ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ఏర్పాటు చేయడంతోపాటూ కొనుగోళ్లు వేగవంతమయ్యేలా చేయాలి. –ఆదె ఈదయ్య, రైతు, శాలిగౌరారం

ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం



ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన మిల్ ట్యాగింగ్ మినహా అన్ని రకాల అనుమతులు ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి వచ్చాయి. ఒకటి, రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు చేపడతాం.

–శంకరయ్య, ఐకేపీ ఏపీఎం, శాలిగౌరారం

గుమ్ములకే డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

- మహంతికి పలువురి వినతి
- జిల్లా కేంద్రంలో రెండో రోజు కొనసాగిన అభిప్రాయ సేకరణ



మహంతికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ: డీసీసీ అధ్యక్ష పదవి గుమ్ముల మోహన్‌రెడ్డికే ఇవ్వాలని పార్టీ శ్రేణులు ముకుమ్మడిగా కోరాయి. ఆదివారం బ్లాక్, పట్టణ కాంగ్రెస్ నాయకులతో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వరంజన్ మహంతి, అబ్జర్వర్లు సుబ్రహ్మణ్యం, ఇంద్రకరణ్‌రెడ్డి వ్యక్తిగతంగా అభిప్రాయాలు సేకరించారు. మొదటి పేరుతో పాటు మరికొంతమంది పేర్లు చెప్పాలని వారు సూచించగా పార్టీ శ్రేణులు మరో పేరు చెప్పడానికి ఇష్టపడలేదు. ప్రతి ఒక్కరూ మరో ఆప్షన్ లేదని మోహన్‌రెడ్డికే ఇవ్వాలని కోరారు. పట్టణంలోని సాయికృష్ణ రెసిడెన్సీలో ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వరంజన్ మహంతిని కలిసిన పలువురు నాయకులు డీసీసీ అధ్యక్ష పదవిని మోహన్‌రెడ్డికే ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాలు అందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లంతా గుమ్ములకు మద్దతు తెలుపుతూ అబ్జర్వర్లకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంగూరి లక్ష్మయ్య, జూకూరి రమేశ్, కూసుకుంట్ల రాజిరెడ్డి, దుబ్బ రూప, ఖయ్యూం బేగ్, ఇబ్రహీం, సమద్, కరుణాకర్‌రెడ్డి, బాబా, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఆమేర్, బొజ్జ శంకర్, కత్తుల కోటి, జూలకంటి సైదిరెడ్డి, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, జహంగీర్ బాబా, దుబ్బ అశోక్ సుందర్, చింత యాదగిరి, కొప్పు నవీన్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, ఉప్పునూతల వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఈశ్వర్, గోపాల్, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

కనీస వేతనం నిర్ణయించాలి



మాట్లాడుతున్న వీరారెడ్డి

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రెండో పీఆర్సీలో రూ.26,000 అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14,15 తేదీల్లో రంగారెడ్డి జిల్లా తుర్కయాంజిల్‌లో నిర్వహించనున్న యూనియన్ రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధికంగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చింతకాయల సంతోష్, శ్రీనివాస్, లక్ష్మమ్మ, పొట్ట తారమ్మ, ఎండీ.సలీం, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, జక్కల రవికుమార్, చిలుముల వెంకన్న, గుండుమల్ల శ్రీనివాస్, పేర్ల సంజీవ, పెరిక కృష్ణ, చిక్కుల రాములు, యల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి



చీకటిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, చీకటిగూడెం, కాసనగోడు, కొత్తపేట, గుడివాడ, కొర్లపహాడ్, బొప్పారం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించడంతోపాటూ కాంటాలు వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజులమాధవరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఏపీఎం మల్లేష్, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు బొజ్జ సుందర్, కోట పుల్లయ్య, బత్తుల దయాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఎడ్ల ప్రవీణ్, మట్టి సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భారంగా డ్రయర్ యంత్రం !

- డీజిల్ భారం రైతులపైనే
- దీనికితోడు కూలీల ఖర్చు కూడా..



తిప్పర్తి మార్కెట్‌లో ఉన్న డ్రయర్ యంత్రం

తిప్పర్తి : రైతులు పండించిన ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉంటున్నందున ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం డ్రయర్ యంత్రం కొనుగోలు చేసింది. జిల్లాలో రెండు యంత్రాలను కొనుగోలు చేయగా.. ఒకటి తిప్పర్తి మార్కెట్ యార్డులో, రెండోది మిర్యాలగూడ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు. తిప్పర్తి మార్కెట్ యార్డులో ఇటీవలే డ్రయర్ యంత్రాన్ని ప్రారంభించారు. అయితే ఈ డ్రయర్ ద్వారా ధాన్యం ఆరబెట్టడానికి అయ్యే ఖర్చు రైతులే భరించాల్సి వస్తోంది. ఈ యంత్రం వాడడం తమకు భారంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రయర్ యంత్రంతో ధాన్యం ఆరబెట్టిన దానికంటే కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకోవడం సులువుగా ఉంటోందని రైతులు పేర్కొంటున్నారు. ఈ యంత్రం ద్వారా సమయం ఎక్కువగా పడుతోందని, రోజుకు ఒకరు లేదా ఇద్దరు రైతులకు చెందిన ధాన్యం మాత్రమే ఆరబెట్టేందుకు అవకాశం ఉంటోందని రైతులు చెబుతున్నారు.

ధాన్యం ఆరబెట్టడానికి అదనపు సమయం..

ధాన్యం డ్రయర్ యంత్రం ట్రాక్టర్ ఇంజన్‌తో రన్ అవుతుంది. ట్రాక్టర్ ఇంజన్‌తోపాటుగా డ్రయర్ మిషన్ కూడా డీజిల్‌తో రన్ చేయాల్సి ఉంటుంది. డ్రయర్ యంత్రం వాడడం వల్ల అదనపు ఖర్చు వస్తోందని, సుమారు 20 నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం ఆరబెట్టడానికి మూడు నుంచి నాలుగు వేల రూపాయల వరకు ఖర్చు అవుతోంది. ఈ యంత్రం ద్వారా ధాన్యం ఆరబెట్టుకుంటే క్వింటాలుకు అదనంగా రూ.150 నుంచి రూ.200 వరకు ఖర్చు వస్తోందని, ఇద్దరు కూలీల అవసరం ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డ్రయర్ యంత్రం కంటే కూలీలతో ధాన్యం ఆరబెట్టుకుంటేనే తక్కువ సమయంలో ఎక్కువ ధాన్యం ఆరబెట్టవచ్చని రైతులు పేర్కొంటున్నారు. డ్రయర్ యంత్రం వినియోగం డీజిల్‌తో కాకుండా విద్యుత్‌తో అయితే బాగుంటుందని రైతులు అంటున్నారు.

సమయం వృథా అవుతోంది



ధాన్యం ఆరబెట్టడానికి తెచ్చిన డ్రయర్ యంత్రంతో సమయం మొత్తం వృథా అవుతోంది. రోజుకు ఒకరు లేదా ఇద్దరు రైతులకే సమయం సరిపోతోంది. దీని కంటే కూలీల ద్వారా ధాన్యం ఆరబెట్టుకుంటేనే సులువు అవుతోంది. డ్రయర్ యంత్రానికి ప్రత్యామ్నాయం ఆలోచించాలి.

–వల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, తిప్పలమ్మగూడెం

ఖర్చు ఎక్కువగా అవుతోంది



ప్రభుత్వం మార్కెట్‌లో ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఏర్పాటు చేసిన డ్రయర్ యంత్రం ద్వారా ఖర్చు ఎక్కువగా వస్తోంది. నేను 15 నుంచి 20 క్వింటాళ్ల ధాన్యం డ్రయర్ యంత్రంతో ఆరబెట్టాను. మూడు వేలకుపైగా డీజిల్ ఖర్చు వచ్చింది. దీని ద్వారా తేమ శాతం మొదట్లో 17 వచ్చినప్పటికీ మరుసటి రోజు మళ్లీ పెరిగింది. దీనిని కరెంటు ద్వారా నడిపిస్తే కొంత బాగుంటుంది.

–భైరగోని శ్రీనివాస్, రైతు, చిన్నాయిగూడెం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శాలిగౌరారం : సమ్మేళనంలో పాల్గొన్న మాధారంకలాన్ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

కనగల్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో 2017–18 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థినులు ఆదివారం దర్వేశిపురం స్టేజీ వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు మెమొంటోలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుమ్మల మంజుల, ప్రజ్వల, రమావత్ ఝాన్సీరాణి, ధనమ్మ, నాగలక్ష్మి, ధనలక్ష్మి, జానీ బేగం, బిల్కిస్, సంతోషి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వీరయ్య, నర్సిరెడ్డి, భిక్షమయ్యలను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.



కనగల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థినులు, ఉపాధ్యాయులు

16న ప్రజావేదిక

మర్రిగూడ : మండల పరిషత్ కార్యాలయంలో 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఈ నెల 16న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య ఆదివారం తెలిపారు. డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు ఈ నెల 13న కొట్టాల, నామాపురం, రాజాపేటతండా, సరంపేట, మేటిచందాపురం, 14న కమ్మగూడ, లెంకలపల్లి, శివన్నగూడ, అజ్జిలాపురం, తిరగండ్లపల్లి, వెంకేపల్లి, తమ్మడపల్లి, 15న దామెరభీమనపల్లి, వట్టిపల్లి, రాంరెడ్డిపల్లి, ఖుదాబాక్షపల్లి, అంతంపేట, మర్రిగూడ, యరగండ్లపల్లి, కొండూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు.

హామీలు అమలు చేయాలి

చండూరు : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కనీస వేతనం ఇస్తామని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేస్తామని అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఏ సమస్య పరిష్కరించలేదన్నారు. ఈ నెల 18న కనగల్‌లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, మండల కన్వీనర్ ధనుంజయ్, సైదులు, వెంకటాచారి, కృష్ణయ్య, ధనమ్మ, లింగయ్య, సత్తిరెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలతోనే స్వేచ్ఛ పొందాం



ఆర్థిక సహాయం అందజేస్తున్న వి.హన్మంతరావు. పక్కన ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్

శాలిగౌరారం: అమరవీరుల త్యాగాలతోనే స్వేచ్ఛను పొందగామని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామంలో నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో రజాకార్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన పదిమంది బాధిత కుటింబీకులకు గతనెల 12న జరిగిన స్తూపావిష్కరణ బహిరంగ సభ సందర్భంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. కాగా ఆదివారం రూ.5 లక్షల నగదును వల్లాల గ్రామంలో పది మంది అమరవీరుల కుటుంబాలకు రూ.50వేలు చొప్పున వారు అందజేశారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితోనే రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లానే కేంద్రబిందువు అయ్యిందన్నారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మలతోపాటూ అనేకమంది సాయుధ పోరాటయోధుల స్ఫూర్తితో వందలాది మంది పోరాటయోధులు నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, దండ అశోక్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ నరిగె నర్సింహ, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్, మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, మాదగోని రామలింగం, నోముల రవి, సైదులు, బోడ అరుణ్, వేముల గోపీనాథ్, గుండ్లపల్లి నాగాజు తదితరులు పాల్గొన్నారు.

శునకాల బెడదతో ప్రజలు హడల్ !



మునుగోడు ప్రధాన కూడలిలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

మునుగోడు: మండల కేంద్రంలోని ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం సమయంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఉదయం సమయంలో చిన్నారులు ఇంటి బయట ఆడుకుంటుంటే వారి వద్ద ఏదైనా వస్తువు కనిపిస్తే వాటిని లాక్కొని తినేందుకు శునకాలు ఎగబడుతున్నాయి. గ్రామ పరిపాలన అధికారులు స్పందించి గ్రామాల్లో శునకాల బెడద తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన వర్షపు నీరు.. ప్రజలకు తప్పని అవస్థలు



షాపుల మధ్య నిలిచిన వర్షపు నీరు



షాపుల మధ్యలో ఉన్న ఇళ్లలోకి చేరిన వర్షపునీరు



ఫంక్షన్‌హాల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

చిట్యాల: పట్టణ కేంద్రంలో నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి పక్కన గల పాల శీతలీకరణ కేంద్రం సమీపంలోని షాపుల చుట్టూ వర్షపు నీరు చేరింది. ఈ ప్రాంతం లోతట్టుగా ఉండడంతోపాటు ఎదురుగా ఉన్న పోతరాజు కుంటలోకి వర్షపు నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన నాలా చెత్త చెదారంతో మూసుకుపోయింది. దీంతో వర్షపు నీరు రహదారి పక్కన ఉన్న శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌తో పాటు ఇళ్లు, షాపుల మధ్యలో నిలిచిపోయింది. దుర్వాసన, దోమలతో ప్రజలు షాపుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు.